క్లుప్తంగా

'తొలిమెట్టు' పరిశీలన



దిలావర్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు పకడ్బందీగా అమలు చేయాలని ఎంఈవో మధుసూదన్ అన్నారు. గురువారం మండలంలోని దిలావర్‌పూర్, గోసంపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణ, విద్యార్థుల ప్రగతి, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాఘవేంద్ర, మంగమ్మ ఉన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో నారాయణరావ్

తానూరు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నారాయణరావ్ పటేల్ అన్నారు. గురువారం భైంసాలోని తన నివాసంలో తానూరు మండలం ఉమ్రి(కే) సర్పంచ్ రత్నమాల, ఉపసర్పంచ్ సాయినాథ్, పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుతిరావ్ పటేల్, మాజీ ఎంపీటీసీ మధుపటేల్ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతి అందజేస్తున్న నాయకులు

కుభీర్: మండలంలోని బెల్గాం తండాలో దాజీరావుపటేల్ స్మారకార్థం ప్రారంభించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతగా దొడర్న జట్టు, రన్నరప్‌గా బెల్గాం జట్టు నిలిచింది. విజేతకు రూ.11వేలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌పటేల్, సర్పంచ్ అనిల్, ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్, సీతారాం, కమలేశ్, యోగేశ్, రమేశ్ పాల్గొన్నారు.

అడవులను కాపాడుకోవాలి

కడెం: అడవులను అందరం కాపాడుకోవాలని ఎఫ్ఎస్వోలు ఉత్తం, శంకర్ అన్నారు. గురువారం మండలంలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాల్లో అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మానవ తప్పిదాలతో అడవికి నిప్పంటుకుంటే వన సంపదకు నష్టం వాటిల్లుతుందన్నారు. వన్యప్రాణులను వేటాడవద్దని సూచించారు. ఇందులో హైటీకోస్ ప్రతినిధి వెంకట్, ఎఫ్‌బీవోలు తిరుపతి, ప్రతాప్ తదితరులున్నారు.

ఓటరు చైతన్యంపై 2కే రన్

మామడ: ఓటర్లకు అవగాహన కల్పించేందుకు మండల కేంద్రంలో గురువారం 2కె రన్ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో రమేశ్ రన్‌ను ప్రారంభించగా ఎంపీడీవో కార్యాలయం వరకు సాగింది. యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆదివాసీ ఎస్టీ విభాగం చైర్మన్‌గా గోవింద్

ఖానాపూర్: కాంగ్రెస్ ఆదివాసీ ఎస్టీ విభాగం జిల్లా చైర్మన్‌గా బానావత్ గోవింద్‌నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆదివాసీ విభాగం రాష్ట్ర చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, గోవింద్‌కు నియామకపత్రం అందించారు. నూతన అధ్యక్షుడు గోవింద్‌నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ పదవిని కట్టబెట్టినందుకు జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు, ఎమ్మెల్యే బొజ్జుకు కృతజ్ఞతలు తెలిపాడు. పార్టీ బలోపేతానికి పాటు పడతానని పేర్కొన్నారు.

నియామకం

కడెం: గావో చలో..బస్తీ చలో అభియాన్ జిల్లా కమిటీని ఇటీవల ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కమిటీ కోకన్వీనర్‌గా కడెంకు చెందిన నల్లా రవీందర్‌రెడ్డిని నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటింటికీ అక్షింతలు పంపిణీ

తానూరు: మండలంలోని మొగ్గి గ్రామంలో గురువారం అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా అక్షింతలతోపాటు శ్రీరాముని చిత్రపటంతో వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఈనెల 22న ఇళ్లలో పూజల అనంతరం అక్షింతలు చల్లాలన్నారు. రాత్రి 5 దీపాలు వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

మార్కెట్ షెడ్ల ప్రారంభమెప్పుడో?

- కుంటాల మండలంలో 'రూర్బన్' కింద నిర్మాణం
- నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు
- వినియోగంలోకి తేవాలంటున్న రైతులు



విఠాపూర్‌లో ప్రారంభానికి నోచుకోని షెడ్లు



కుంటాలలో నిరుపయోగంగా మార్కెట్ షెడ్లు

కుంటాల: పట్టణాల మాదిరి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూర్బన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో ఈపథకం కింద కుంటాల ఉమ్మడి మండలాన్ని ఎంపిక చేసి రూ.100 కోట్లు కేటాయించారు. ఈ మండలంలోని గ్రామాల్లో ప్రగతి పనులు, ఉపాధి, విద్యా, వ్యవసాయ రంగాలకు చేయూతనిచ్చేందుకు ఈ నిధులు ఖర్చు చేయాలి.

ఇందులో కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా ఉంటుంది. ఈ పథకం కింద రైతులు పండించిన కూరగాయలను విక్రయించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో నాలుగేళ్ల కిందట నిర్మించిన కూరగాయల మార్కెట్ షెడ్లు ప్రారంభించలేదు.

రూ.లక్షలు వెచ్చించి..

కుంటాల మండలంలోని పలు గ్రామాల్లో రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం కూరగాయల మార్కెట్ షెడ్లను నిర్మించింది. కానీ నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. కుంటాలలో రూ.43 లక్షలు వెచ్చించి నాలుగు కూరగాయల షెడ్లు, కల్లూర్, అందాకూర్, దౌనెల్లి, విఠాపూర్, లింబా(కే), ఓలా, అంబకంటి గ్రామాల్లో రూ.7 లక్షల చొప్పున వెచ్చించి రెండేసి షెడ్లను నిర్మించి వదిలేశారు. కానీ వీటిని ప్రారంభించలేదు.

నాలుగేళ్లు గడిచినా..

మండల ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. కుంటాల, కల్లూర్, ఓలా, లింబా(కే), అంబకంటి, విఠాపూర్ గ్రామాల్లో ప్రజలు కూరగాయలు ఎక్కువగా పండిస్తారు. మండలంలోని ఓలాలో బుధవారం, కుంటాలలో ఆదివారం నిర్వహించే వారసంతలో రైతులు తాము పండించిన కూరగాయలను విక్రయిస్తారు. వీటితోపాటు నర్సాపూర్(జి), భైంసా, నిర్మల్ పట్టణాలకు వెళ్లి మార్కెట్లో కూరగాయలు విక్రయిస్తారు.

ఇబ్బందులు తలెత్తకుండా..

రైతులకు, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా పలు గ్రామాల్లో కూరగాయల మార్కెట్ షెడ్లను నిర్మించింది. నాలుగేళ్లు గడుస్తున్నా వాటిని ఇప్పటికీ ప్రారంభించలేదు. కుంటాలలో ఊరు బయట నిర్మించడంతో ఉపయోగకరంగా లేవని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



కూరగాయలు పండించి వాటిని ఇంటింటికీ తిరిగి విక్రయిస్తా. మా గ్రామంలో మార్కెట్ షెడ్లు నిర్మించినప్పటికీ దానిని ప్రారంభించలేదు. షెడ్లను వినియోగంలోకి తీసుకొస్తే మాకు మేలు జరుగుతుంది. – గల్లాపురం భోజవ్వ, విఠాపూర్

శివారులో నిర్మించారు..



రైతులు, వినియోగదారుల సౌకర్యార్థం కుంటాలలో కూరగాయల మార్కెట్ షెడ్లు నిర్మించారు. ఊరు బయట నిర్మించడంతోపాటు ఇప్పటికీ ప్రారంభించలేదు. బస్టాండ్ ఆవరణలో సంత కొనసాగించాలి. – చిప్ప గజేందర్, కుంటాల

త్వరలో షెడ్లను ప్రారంభిస్తాం

రైతులు పండించిన కూరగాయలను విక్రయించుకునేందుకు రూర్బన్ నిధులతో అవసరం ఉన్న చోట మార్కెట్ షెడ్లను ప్రభుత్వం నిర్మించింది. త్వరలో వాటిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. కుంటాలలో ఊరు బయట ఖాళీ స్థలం ఉండటంతో నిర్మించాం. – దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో

గంగాపూర్ వంతెన నిర్మాణానికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

కడెం: గంగాపూర్ వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం మండలంలోని మారుమూల గంగాపూర్ గ్రామాన్ని సందర్శించారు. కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో నిర్మించ తలపెట్టిన వంతెన స్థలం పరిశీలించారు. అనంతరం పేదలకు దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అలెగ్జాండర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు, సర్పంచ్‌లు తదితరులున్నారు.

'దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'



శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉద్యమకారుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు గురువారం నిర్మల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ దయాకర్ తెలంగాణ ఉద్యమంలో ఎంతో పోరాటం చేశారని గుర్తు చేశారు. ఇటీవల ప్రకటించిన జాబితా ఆయన పేరు లేకపోవడం బాధాకరమని.. ఇప్పటికైనా దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. రాసమళ్ల అశోక్, దాసరి రాజన్న, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నేత శ్యాం, బేర తిరుమలేశ్ పాల్గొన్నారు.

భైంసాటౌన్: దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని మాలమహానాడు జిల్లా నాయకులు భీంరావు డోంగ్రే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి హామీతో దయాకర్ ఎమ్మెల్యే టికెట్‌ను సైతం వదులుకున్నారని పేర్కొన్నారు. గౌతంపింగ్లే, భీం చంద్రే, దళిత్ బన్సోడే, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి రాజన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. అశోక్, నేత శ్యామ్, తిరుమలేశ్, సతీశ్, దాస్, సురేశ్, దామోదర్, రాజేందర్, అభిషేక్ తదితరులున్నారు.

ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఉమ్మడి రాష్ట్ర ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేసి.. తెలుగు ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ అని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మల్‌లో మొదటిసారిగా 1982లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు గుర్తు చేసుకున్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

అవకాశం కల్పిస్తే అభివృద్ధికి కృషి

భైంసాటౌన్: రాష్ట్రంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెనుకబడి ఉందని.. తనకు అవకాశం కల్పిస్తే అన్ని విధాల అభివృద్ధి చేస్తానని సినీ నటుడు, సామాజిక, పారిశ్రామికవేత్త సర్దార్ అభినవ్ నాయక్ అన్నారు. గురువారం భైంసాకు వచ్చిన ఆయన స్థానిక ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం వద్ద మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీలో ఉండనున్నట్లు ఆయన తెలిపారు. తనకు మద్దతు తెలపాలని ఎమ్మెల్యే రామారావుపటేల్, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి



సోన్: సమీక్షలో పాల్గొన్న శాఖల అధికారులు

సోన్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో తీర్మాణాలు చేసి పనుల వివరాలను ఈగ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శివరాజ్, ఎంపీఓ ఖలీల్ హైమద్, ఎంపీవో మంజులారెడ్డి, ఐకేపీ ఏపీఎం గంగామణి, వైద్యులు వెంకటేశ్వర్, ఏఈ శ్రీనివాస్, ఏఓ వినోద్‌కుమార్, అంబాజీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్లాన్ (జీపీడీపీ) రూపొందించి ఈనెల 27లోగా గ్రామసభల్లో తీర్మాణాలు చేపట్టాలని ఎంపీడీఓ అల్లాడి వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధి పనుల్లో కూలీల శాతం పెరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. మోడల్ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసి సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ రజనీదేవి, నీటిపారుదల శాఖ ఏఈ గంగాధర్, పశువైద్యాధికారి గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా ఉంటా

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



ముధోల్‌లోని క్యాంపు కార్యాలయంలో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసా: ఆడబిడ్డలకు అండగా ఉంటానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. గురువారం ముధోల్‌లోని క్యాంప్ ఆఫీసులో 369 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించాలని.. పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, తహసీల్దార్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈరోజు

మండల సర్వసభ్య సమావేశం

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరవాలని కోరారు.

2కే రన్

కుంటాల: ఓటు హక్కు నమోదుకు వెంకూర్ పెద్దమ్మ ఆలయం నుంచి కుంటాల వరకు శుక్రవారం 2కె రన్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎస్సై హన్మాండ్లు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

దిలావర్‌పూర్: ప్రతి గ్రామంలో ఈనెల 20, 21న నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డి.సరిత అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. బీఎల్‌వోలు సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటారని తహసీల్దార్ పేర్కొన్నారు. ఇందులో ప్రిన్సిపాల్ కందూరి శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పట్వారీ నవీన్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతగా నమోదు చేసుకోవాలి

లక్ష్మణచాంద: 18ఏళ్లు నిండినవారు బాధ్యతగా భావించి ఓటరుగా నమోదు చేసుకోవాలని చరిత్ర అధ్యాపకులు రాజేశ్వర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని సహకార జూనియర్ కళాశాలలో ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు–దాని విలువ అనే అంశంపై కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కిష్టయ్య, అధ్యాపకులు శ్రీనివాస్, రాజేశ్వర్, సుదర్శన్, భోజన్న, రవీందర్, రాజశేఖర్, స్వరాజ్యం, స్వప్న, సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్ కాలనీలో..

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గురువారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఓటరు కార్డుల్లో తప్పులకు సవరణలు చేసుకోవాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఏడీఎంసీ సురేశ్, శివ, తదితరులు ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు



యూరియా పంపిణీ చేస్తున్న ఏవో లింగారెడ్డి

కుంటాల: రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏవో సోమలింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం కుంటాలలోని ప్యాక్స్, ఆగ్రోస్ రైతు సేవా సమితి కేంద్రాల్లో యూరియా పంపిణీని పరిశీలించారు. కుంటాలలో 60 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సీఈవో నాగభూషణం, ఏఈవోలు మహేశ్, శ్రీధర్, నిర్వాహకులు ఉన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దు

దిలావర్‌పూర్: ప్రైవేటు వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై యాసిర్ అరాఫత్ అన్నారు. మండలంలోని సిర్గాపూర్ బస్టాండ్ వద్ద గురువారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, ఇతర ప్రైవేటు వాహనదారులకు కౌన్సిలింగ్ చేశారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను వివరించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

లౌడ్‌స్పీకర్ అందజేత

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆంగ్ల ఉపాధ్యాయుడు గణపతి రూ.ఏడు వేల విలువైన లౌడ్‌స్పీకర్‌ను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పసుల గంగాధర్ తదితరులున్నారు.

భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర

సోన్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ఆర్ఎం గంగోని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. గురువారం మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం గ్రామాల్లో భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. అనంతరం న్యూవెల్మల్ గ్రామంలో ఉన్నత పాఠశాల వద్ద డ్రోన్ ద్వారా పంటలపై మందులు పిచికారీ చేసే విధానం వివరించారు. ఎల్‌డీఎం మేనేజర్ చంద్రశేఖర్, యూబీఐ మేనేజర్ మౌనిక, భవాని, ప్రసన్న, శ్రీనివాస్‌గౌడ్, సాగర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రవేశాలపై అవగాహన

సారంగాపూర్: గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని జామ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ రమాకల్యాణి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సిబ్బందితో వెళ్లి అవగాహన కల్పించారు. వచ్చే నెల 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని.. విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు రాధిక, స్వరూప, సుప్రియ, ఉమ, గిరిజ, అలేఖ్య ఉన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో కంపు



చైన్‌గేట్ సమీపంలో అధ్వానంగా కందకం



ప్రియదర్శినినగర్‌లో నిండిన ప్లాస్టిక్ వ్యర్థాలు



డాక్టర్స్ స్ట్రీట్‌లో..

జిల్లా కేంద్రంలోని పెద్ద పెద్ద కందకాలు, మురుగు కాల్వలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి కంపు కొడుతున్నాయి. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రియదర్శినగర్, ఇంద్రనగర్, బుధవార్‌పేట్ రామ్‌రావు బాగ్, కూరానాపేట్ మార్గం గుండా వెళ్లే ప్రధాన కాల్వల్లో పూడిక పేరుకుపోయింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కందకాలు, మురుగుకాల్వలను శుభ్రం చేయించాలని వేడుకుంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

వెంచర్ పరిశీలించిన అధికారులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో అక్రమంగా వెంచర్ వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు, గంగపుత్రులు ఇటీవల తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ శ్రీనివాస్, నీటి పారుదలశాఖ ఏఈ గంగాధర్, సర్వేయర్ మోహన్‌కృష్ణ, ఆర్ఐ వేణుగోపాల్ గురువారం వెంచర్‌తో పాటు పత్రాలను పరిశీలించారు. నక్ష (ల్యాండ్ మ్యాప్) ప్రకారం గొలుసు కట్టు చెరువు కాలువ వెంచర్ గుండా వెళ్తుందని అధికారులు తేల్చగా వెంచర్ యజమాని అంగీకరించలేదు. వెంచర్ మధ్యలో గొలుసు కట్టు కాలువ ఉండగా నాలా కన్వర్షన్‌కు ఎలా అనుమతి ఇచ్చారని రైతులు, గంగపుత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.